క్లుప్తంగా

52వేల క్వింటాళ్ల జొన్నల కొనుగోలు



తాంసిలో జొన్నలు తూకం వేస్తున్న కూలీలు

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి 52వేల క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు సీఈవో కేశవ్ గురువారం తెలిపారు. గత నెల నుంచి కొనుగోళ్లు ప్రారంభించగా నేటి వరకు 1634 మంది రైతుల నుంచి 52 వేల క్వింటాళ్లకు పైగా జొన్నలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన రైతులకు గ్రామాల వారీగా తేదీలు కేటాయించి కొనుగోలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా గడ్‌బోరికర్ పెర్సాపెన్ పూజలు



పెర్సాపెన్ పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

నార్నూర్: వైశాఖమాసం సందర్భంగా ఆదివాసీ గిరిజనులు గడ్ బోరికర్ పెర్సాపెన్ పూజను గురువారం మండలంలోని ధానుగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. పెర్సాపెన్‌ను గ్రామంలో ఊరేగించారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కోసం బేతల్క్ దేవుడి వద్దకు వెళ్లి మొక్కు చెల్లించి తుంక్ కార్యక్రమం నిర్వహించారు. తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు, గాడ్ బోరికర్ పెర్సాపెన్ కటోడ పెందూర్ భీంరావు, పెన్ పటేల్ పెందూర్ మాధవరావు, యాదవరావు, గ్రామ పటేల్ రఘు, మాజీ ఎంపీటీసీ పెందూర్ సోనేరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

సాత్నాల: విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. భోరజ్ మండలంలోని జెడ్పీఎస్ఎస్ గిమ్మ పాఠశాలలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు పాల్గొంటున్నారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ శిబిరంలో డాన్స్, యోగా, మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, చెస్, క్యారం, స్కిప్పింగ్, స్నేక్ అండ్ లాడర్ వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్ట్ టీచర్ వినోద్, క్రాఫ్ట్ టీచర్ మనోహర్, ఉపాధ్యాయుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన రాజేశ్



కేటీఆర్‌ను కలిసిన ధరణి రాజేశ్

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ తన పుట్టినరోజు సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫుడ్ బాస్కెట్ పంపిణీ

జైనథ్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ చేశారు. డాక్టర్ నయనతా ఉన్నారు.

విశ్రాంతి భవనంలో దుర్గంధం



చెత్తతో నిండిపోయిన రైతు విశ్రాంతి భవనం

ఇచ్చోడ: వ్యవసాయ మార్కెట్‌యార్డులో లక్షల రూపాయలు వెచ్చించి రైతు విశ్రాంతి భవనం నిర్మించారు. కానీ మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విశ్రాంతి భవనంలో దుర్గంధం వెదజల్లుతోంది. ఒక్కగది చెత్తతో నిండిపోగా, మరో గదిలో కుక్కలు నిద్రిస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.



గదిలో నిద్రిస్తున్న కుక్క

స్విమ్మింగ్ 'కూల్'!

- ఈత శిక్షణలో చిన్నారుల ఉత్సాహం
- ఆత్మరక్షణ కోసం పంపిస్తున్న తల్లిదండ్రులు
- చిన్నారులతో సందడిగా స్విమ్మింగ్ పూల్



స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారుల సందడి

ఆదిలాబాద్: వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునే విధంగా తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలు, కళలు, విద్యా సంబంధిత అంశాల్లో ప్రత్యేక శిక్షణ కేంద్రాలకు పంపిస్తున్నారు. ఆయా విషయాల్లో పిల్లలు సామర్థ్యాలు పెంపొందించుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారు. వేసవి తాపంతో పాటు చిన్నారులకు ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చేలా కొందరు తల్లిదండ్రులు ఈతలో శిక్షణ ఇప్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు చెరువులు, కుంటలు, బావుల్లో స్నానాలు చేస్తూ ఈత నేర్చుకుంటారు. కానీ పట్టణ ప్రాంతాల్లో స్విమ్మింగ్ పూల్‌లో మాత్రమే నేర్చుకునే వెసులుబాటు ఉంటుంది. కాగా ఈత శిక్షణ కోసం చిన్నారులు తరలివస్తుండడంతో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్ బాలలతో సందడిగా మారింది.

ఎన్నో ప్రయోజనాలు..

ఈత కొట్టడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈత సాధన చేయడం వలన శరీరంలోని రక్త ప్రసరణ మెరుగుపడడంతో పాటు కండరాలు దృఢంగా మారుతాయి. అదేవిధంగా గుండె, ఊపిరితిత్తులు ఎంతో ఆరోగ్యంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో క్రమం తప్పకుండా ఈత కొడితే వ్యాయామంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడిస్తున్నారు. స్విమ్మింగ్ చేస్తే అదనపు కొవ్వు కరిగి శరీరం ఫిట్‌గా తయారవుతుందని ఈత శిక్షకులు వివరిస్తున్నారు. ఈత కొడితే మానసిక అలసట తగ్గి చిన్నారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా హాయిగా నిద్రపోతారని చెబుతున్నారు. ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటూ అన్ని విషయాలపై ఏకాగ్రత, శ్రద్ధను కనబరుస్తారంటున్నారు.

ఆత్మరక్షణ నుంచి ఆటగాళ్ల దాకా..

ఎంతో మంది పిల్లలు ఈత రాక చెరువులు, బావులు, కుంటలు వంటి ప్రాంతాల్లో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులకు ఈతను నేర్పిస్తే ఆత్మ రక్షణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఆత్మరక్షణ కోసమే కాకుండా స్విమ్మింగ్ క్రీడాకారులుగా ఎదిగేందుకు సైతం తోడ్పడుతుంది.

ఎంతో సరదాగా ఉంది..



స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకోవడం ఎంతో సరదాగా ఉంది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ట్యూబ్ సహాయంతో నేర్చుకుంటున్నాను. మొదట్లో కాస్త భయమేసేది. అయితే కోచ్ సహాయంతో ఇప్పుడు భయం లేకుండా నేర్చుకుంటున్నాను. కొన్ని రోజుల తర్వాత ట్యూబ్ లేకుండానే ఈత కొడతా.

– సూది నిహస్వి, ఆదిలాబాద్

స్విమ్మింగ్ క్రీడాకారుడినవుతా..



రోజంతా స్విమ్మింగ్ చేయడం వలన ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. వేరే ఆటలతో పోలిస్తే సిమ్మింగ్ ఎంతగానో నచ్చింది. ఈతలో ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నాను. భవిష్యత్తులో సైతం స్విమ్మింగ్ చేయాలని అనుకుంటున్నాను. మంచి స్విమ్మింగ్ క్రీడాకారుడిగా రాణిస్తాను.

– శ్రీజన్ ప్రసాద్, ఆదిలాబాద్

చిన్నారులకు ఎంతో ఉపయోగం



ఈత వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే మా పిల్లల్ని ఈత కోసం తీసుకొస్తున్నాను. వారు కూడా ఎంతో ఉత్సాహంగా ఈత నేర్చుకుంటున్నారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా ఈత నేర్పిస్తున్నాం. చిన్నారులకు ఈత ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– సంజయ్ రాయ్, భుక్తాపూర్, ఆదిలాబాద్

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఈవో సంజీవ్ నాయక్

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తున్న రైతు గుర్తింపు కార్డు కోసం ప్రతీఒక్క రైతు వివరాలు నమోదు చేసుకోవాలని ఇచ్చోడ క్లస్టర్ ఏఈవో సంజీవ్ నాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాల కోసం గుర్తింపు కార్డు తప్పనిసరన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నంబర్‌ను ఫోన్ నంబర్‌కు లింకు చేసుకోవాలని కోరారు. రైతులు ఏఈవోల వద్ద, మీసేవ కేంద్రాల్లో జూన్ 6వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

సమీకృత, సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజశేఖర్

బేల: రైతులు సమీకృత, సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివచరణ్‌లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చప్రాల గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెరువు మట్టి, పశువుల పెంట, వర్మి కంపోస్టు, వేపనూనె, వేపపిండి, జీవ సంబంధ పురుగు మందులు ట్రికోడెర్మా వెరిడి, రైజోబియం, పీఎస్‌బీ, లింగాకర్షక బుట్టలు, పసుపు నీలిరంగు జిగురు అట్టలు, అంతర పంట, పంట అవశేషాలను భూమిలో కలియ దున్నడం, పంట నిల్వలు వంటి అంశాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి సాయి తేజరెడ్డి, మండల పశు వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ అధికారి సత్యనారయణ, ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి

సిరికొండ: వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ కళాశాల డీన్ శాస్త్రవేత్త శ్రీధర్ అన్నారు. మండలంలోని లచ్చింపూర్ గ్రామంలో రైతువేదికలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త మురళీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారస్వామి, మండల వ్యవసాయాధికారి శ్రద్ధరాణి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు దీపక్, మాజీ ఎంపీపీ పెందూర్ అమృత్ రావు, మాజీ గ్రామ సర్పంచ్ నర్మద ఉన్నారు.

చిక్కినా చింత లేదు..!

నిబంధనలు అతిక్రమించినా జరిమానాలు పడకుండా ద్విచక్ర వాహనదారులు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ద్విచక్ర వాహనదారులు బండికి నంబర్ ప్లేట్లు లేకుండా, ఉన్న నంబర్ ప్లేట్లలో ఏదో ఒక నంబర్‌ను చెరిపివేసి దర్జాగా పోలీసులకు చిక్కకుండా, జేబుకు చిల్లుపడకుండా తిరుగుతున్నారు. హెల్మెట్ లేకపోయినా, అతివేగంతో నిర్లక్ష్యంగా నడిపినా, రాంగ్‌రూట్‌లో వెళ్లినా జరిమానాలు పడకుండా చూసుకుంటున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్







ఎస్సీ, ఎస్టీ భూములను ఆక్రమిస్తే సహించం



సొనాలలో మాట్లాడుతున్న విశారదన్

బోథ్: ఎస్సీ, ఎస్టీ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పేర్కొన్నారు. గురువారం సొనాల మండల కేంద్రంలోని దళితుల శ్మశాన వాటిక బౌద్ధ విహార ప్రాంత భూమిని సందర్శించారు. సొనాలలో దళితుల భూమిపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల భూముల రక్షణ కోసం విద్య, వైద్యం, ఉపాధి, భూమిని సాధించడం కోసం లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర చేపట్టినట్లుగా వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్, సొనాల మండల అధ్యక్షుడు మడుగు గణేశ్, ఇచ్చోడ మండల నాయకులు శ్రీనివాస్, అశోక్, చింటూ, నరేశ్, రాకేశ్ నాయకులు పాల్గొన్నారు.

'దుకాణాలు తొలగించాలి'

ఉట్నూర్‌రూరల్: నాయీబ్రాహ్మణులు కుల వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నామని ఇతరులు వేరే రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ దుకాణాలు పెట్టడంతో ఉపాధి దొరకకుండా పోతుందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఉట్నూర్ మండల అధ్యక్షుడు గర్షకుర్తి వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఇతరుల దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

సిరికొండ: నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీసాయిని మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం పోలీసుస్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఎస్పీని కలిసిన ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం



ఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి ఎస్పీ అఖిల్ మహాజన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లి మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ మసూద్ తదితరులు ఉన్నారు.

రైతులను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు



రైతును పరామర్శిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే రక్షణలేకుండా పోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో దొంగల దాడిలో గాయపడ్డ రైతులను గురువారం ఆయన పరామర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ఇన్‌చార్జీతో మాట్లాడి కల్పిస్తున్న భద్రత వివరాలను ఆరా తీశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు అలాల్ అజయ్, మెట్టు ప్రహ్లాద్, అశోక్, తిరుపతి, మహేందర్, మోబిన్, కుమ్ర రాజు, నరేశ్, మహేశ్, తదితరులు ఉన్నారు.

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న తాహిర్ బిన్ హాందాన్

తలమడుగు: కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హాందాన్ అన్నారు. గురువారం మండలంలోని రుయ్యడిలో తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హాందాన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ హాజరయ్యారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, సీనియరు నాయకులు నరేశ్ జాదవ్, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇచ్చోడ, గుడిహత్నూర్, సిరికొండ మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బోథ్, ఆదిలాబాద్ ఇన్‌చార్జీలు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజరెడ్డి, నాయకులు నరేష్‌జాదవ్, మల్లెపూల నర్సయ్య, ఇచ్చోడ మండల పార్టీ అధ్యక్షులు కళ్లెం నారాయణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ అన్నారు. గురువారం బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, సొనాల మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ అంతర్గత వేదికల మీద సమస్యలు పరిష్కరించుకోలని, బహిరంగంగా ఎవరైనా మాట్లాడితే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గాల ఇన్‌చార్జీలు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి, భోజరెడ్డి, గంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేశ్ జాదవ్ ఉన్నారు.

రుణం అందేదెవరికో!



దరఖాస్తుదారులకు ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్న వార్డు ఆఫీసర్లు

- భారీగా 'వికాసం' దరఖాస్తులు
- కొనసాగుతున్న అర్హుల ఎంపిక

కైలాస్‌నగర్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోంది. దీని కింద రూ.50 వేల నుంచి రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం చేయనుంది. దాదాపు పదేళ్ల తర్వాత స్వయం ఉపాధికి ప్రభుత్వం రుణాలు ప్రకటించడంతో ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. వాటిని పరిశీలించిన అధికారులు అర్హుల వివరాలు ఆయా బ్యాంకులకు పంపించేందుకు కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తుల్లో ఆధార్‌కార్డు, పాన్‌కార్డు వివరాలు నమోదు చేయకపోవడంతో వార్డు ఆఫీసర్లు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి సమాచారం సేకరిస్తున్నారు. దరఖాస్తులు వేలల్లో రావడం, యూనిట్లు వందల్లోనే ఉండటంతో రుణాలు ఎవరికి అందుతాయనేది ఆసక్తికరంగా మారింది.

దరఖాస్తుల వెల్లువ..

రాజీవ్ యువ వికాసం ఆర్థిక చేయూత కోసం ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. 49వార్డుల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలకు సంబంధించి 12,167 దరఖాస్తులు అందాయి. బల్దియా వార్డు ఆఫీసర్లు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల హార్డ్‌కాపీలను స్వీకరించారు. అవసరమైన వివరాలు సేకరించారు. ఇందులో అత్యధికంగా బీసీలు 5,393 మంది దరఖాస్తు చేయగా ఇప్పటివరకు 5177 దరఖాస్తులు పరిశీలించారు. ఈబీసీలు 270 మంది దరఖాస్తు చేయగా 220 పరిశీలించారు. ఎస్సీలు 2,268 దరఖాస్తులకు గాను 2063 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఎస్టీలు 470 మంది దరఖాస్తు చేయగా 428 దరఖాస్తులు పరిశీలించారు. మైనార్టీలు 3,728 మంది దరఖాస్తు చేయగా 3,317, క్రిస్టియన్ మైనార్టీలు 38 మంది దరఖాస్తు చేయగా 26 దరఖాస్తులు పరిశీలించారు. ఇందులో అర్హులను గుర్తించి దరఖాస్తుదారుల వివరాలు బ్యాంకుల వారీగా పంపించేందుకు కసరత్తు చేస్తున్నారు. కొందరు దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, పాన్ కార్డు వివరాలను దరఖాస్తుల్లో నమోదు చేయకపోవడంతో గురువారం వార్డు ఆఫీసర్లు వారికి ఫోన్ చేసి వివరాలు సేకరించారు.

ఎంపిక ప్రక్రియ..

ఎంత మేరకు లక్ష్యాన్ని నిర్దేశించారనే దానిపై మున్సిపల్ అధికారులు వివరాలు వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దరఖాస్తుల సంఖ్యకనుగుణంగా రుణ లక్ష్యాన్ని ఇదివరకే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కమిటీ ఖరారు చేసి మండలాలతో పాటు మున్సిపాలిటీకి పంపించింది. అయితే ఆ వివరాలను అధికారులు వెల్లడించకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులు వేలల్లో అందగా యూనిట్లు వందల్లో ఉన్నట్లు సమాచారం. దీంతో వాటిని గ్రౌండింగ్ చేయడం వారికి సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. అర్హుల వివరాలు బ్యాంకులకు పంపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 19 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. వేలాదిగా అందిన దరఖాస్తుదారుల్లో ఎవరికి రుణాలు అందుతాయనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దరఖాస్తుదారులు ప్రభుత్వ సాయాన్ని అందుకునేందుకు తమదైన రీతిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొమ్ముగూడ గ్రామానికి చెందిన మధుకర్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై పూజ తెలిపిన వివరాల ప్రకారం కొమ్ముగూడకు చెందిన రాథోడ్ మధుకర్ (46) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో భార్య లత రోజూ మద్యం తాగితే ఆడ పిల్లల పెళ్లిళ్లు ఎలా చేస్తామని మందలించింది. గురువారం తాగిన మైకంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లత, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఆదిలాబాద్
99516 02888
99122 20764

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899